పశు బీమా.. రైతులకు ధీమా

- ఆపద్బాంధవిగా వైఎస్సార్ పశు బీమా పథకం
- పాడి రైతులకు ఎంతో మేలు


నడవపల్లిలో పశువులకు బీమా చేయించి బాండ్ పేపర్ అందుకుంటున్న రైతు

కాట్రేనికోన: ప్రభుత్వం పశువుల రక్షణ కోసం ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశువుల బీమా పథకం పాడి రైతుల పాలిట ఆపద్బాంధవిగా మారింది. పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్న పాడి రైతులు తమ పశువులు చనిపోతే ఆర్థికంగా నష్టపోకూడదని ప్రభుత్వం వారికి అండగా నిలుస్తూ వైఎస్సార్ పశు బీమా పథకాన్ని తీసుకొచ్చింది. ఏవైనా విపత్తుల్లో లేదా అనుకోని ఘటనల్లో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు మృతి చెందితే సదరు యజమానికి నష్టపరిహారం అందిస్తున్నారు. అయితే ఈ పథకంపై అవగాహన లేక అత్యధిక శాతం మంది రైతులు బీమా చేయించుకోవడం లేదని అధికారులు చెబుతున్నారు.

ఆపదలో ఆదుకునే పశు బీమా

ప్రకృతి వైపరీత్యాలు వరదలు, తుపానులు, పాము కాటు, అడవి జంతువుల దాడి, పిడుగు పడినపుడు, అగ్ని ప్రమాదం, రోడ్డు, రైలు ప్రమాదాలు, జబ్బుతో పశువులు మృత్యువాత పడితే వైఎస్సార్ పశు బీమా పథకం వర్తింపజేసి ఆయా రైతులకు నష్ట పరిహారం అందజేస్తారు. ఉత్పాదక దశలో ఉన్న 2–10 ఏళ్ళ వయసులోపు ఉన్న ఆవులు, 3–12 ఏళ్ళ వయసున్న గేదెలకు రూ.30 వేలు, ఏడాదిన్నర వయసున్న మేలు జాతి ఎద్దులు, దున్నలకు రూ.30 వేలు, రెండేళ్ళకు పైబడిన ఎద్దులు, దున్నలు, నాటు ఆవులకు రూ.15 వేలు, ఆరు నెల వయసు పైబడిన మేకలు, గొర్రెలు, పందులకు రూ.6 వేలు చొప్పున బీమా పథకం వర్తిస్తుంది. అధికారిక లెక్కల ప్రకారం కాట్రేనికోన మండలంలో ఆవులు 5410, గేదెలు 4803, మేకలు 1533, గొర్రెలు 840, ఇతర పశువులు 300 కలిపి మొత్తం 12,886 పశువులున్నాయి. కాని ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశు బీమా పథకానికి కేవలం 258 పశువులకు మాత్రమే బీమా చేయించారు. పశు బీమాపై అవగాహన లేక రైతులు ముందుకు రావడం లేదని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

బీమా ప్రీమియంలో రాయితీ

ఎస్సీ, ఎస్టీ పాడి రైతులు 20 శాతం ప్రీమియం, ఇతరులైతే 50 శాతం ప్రీమియం చెల్లిస్తే మిగిలిన సొమ్ము ప్రభుత్వమే చెల్లిస్తుంది. పాడి రైతులు ఆవు, గేదెలకు రూ.15 వేల బీమాకు గాను రూ.192 ప్రీమియం కడితే ప్రభుత్వం మరో రూ.768 చెల్లిస్తుంది. రూ. 30 వేల బీమాకు గాను రూ.384లు రైతులు కడితే మిగిలిన రూ.1,536 ప్రీమియాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. మేకలు, గొర్రెలు, పందులకు ఏడాదికి ప్రభుత్వ రాయితీ రూ.144 చెల్లించగా రూ.36 చొప్పున ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. ఇతరులు ఆవులు, గేదెలకు రూ.15 వేలకు రూ.480, రూ.30 వేలకు రూ.960 లబ్ధిదారుని వాటాగా చెల్లిస్తే మిగిలిన 50 శాతం సొమ్మును ప్రభుత్వమే చెల్లిస్తుంది.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రమాదవశాత్తు పశువులు మృత్యువాత పడితే పశుపోషణపై జీవిస్తున్న పాడి రైతులకు మేలు చేయాలని ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. బీమా ప్రీమియం సొమ్ములో ప్రభుత్వం రాయితీ కల్పిస్తుంది. ఆపదలో ఆదుకునే పశు బీమా పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– యామిని, పశువైద్యాధికారి, కాట్రేనికోన

బీమా చేయించడంతో భరోసా దొరికింది

ప్రభుత్వం 80 శాతం రాయితీపై పశువులకు బీమా చేయించడంతో పశువుల పోషణకు భరోసా దొరికింది. ప్రమాదవశాత్తు ఇబ్బందులు ఎదురైనపుడు బీమా దోహద పడుతుంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– గిడ్డి గోపాలస్వామి, పాడి రైతు, కాట్రేనికోన

దుర్గమ్మ సేవలో మంత్రి పినిపే విశ్వరూప్


మంత్రి విశ్వరూప్‌కు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఈఓ రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి విశ్వరూప్ దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం మంత్రికి వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ ఈఓ కేఎస్ రామారావు అమ్మవారి ప్రసాదం, పట్టువస్త్రాలను అందజేశారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు


క్రీడాకారులను అభినందిస్తున్న మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు తదితరులు

ఐ.పోలవరం: క్రీడల్లో రాణించేవారికి మంచి భవిష్యత్తు ఉంటుందని, ఆడుదాం ఆంధ్రా పోటీలతో క్రీడా స్ఫూర్తి పెరుగుతుందని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు అన్నారు. మండలంలోని కేశనకుర్రు మూడో సచివాలయం పక్కన ఏర్పాటుచేసిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. టోర్నమెంట్‌లో బాలుర విభాగంలో టి.కొత్తపల్లి-2 సచివాలయం, బాలికల విభాగంలో జి.మూలపొలం సచివాలయం నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని ఎంపీడీఓ చైతన్య తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కాశీ పరివాజ్‌కుమార్, ఎంఎస్ఎన్ రాజు, చింతా రాంబాబు, సుబ్బరాజు, శీలం వెంకటరమణ, కత్తుల సుదర్శన్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారులకు గుర్తింపు



గొల్లవిల్లిలో మండల స్థాయి విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సంపదరావు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా ద్వారా గుర్తింపు లభించిందని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. మండలంలోని గొలవెల్లి, భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలకు శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో సత్తా చాటి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జొన్నాడ శ్రీదుర్గ, పెయ్యల రాజ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు పెట్టా అప్పారావు, జోగి రాజా, లంకే చిరంజీవి, జొన్నాడ చిన్ని, ఎంఈఓ సత్తి సత్యకృష్ణ, ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి, పీడీలు కామన మధుసూదన్‌రావు, గొలకోటి ఫణీంద్ర, దూలం సరస్వతి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఢిల్లీ అధికారి ఉమా నందూరి, ఎంపీపీ సునీత

తాళ్లరేవు: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం శనివారం స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి అధ్యక్షతన ఉత్సాహంగా జరిగింది. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను వికసిత్ భారత్ ఢిల్లీ అధికారి ఉమా నందూరి, ఎంపీపీ రాయుడు సునీతతో కలిసి సందర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా అందరితో వికసిత్ భారత్ ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, స్టేట్ కోఆర్డినేటర్ వేటుకూరి సూర్యనారాయణరాజు, జిల్లా కోఆర్డినేటర్ పుట్టా వీర ప్రసాద్ గాంధీ, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, కొపనాతి దత్తాత్రేయ వర్మ, జిల్లా పరిషత్ సీఈఓ ఎ.రమణారెడ్డి, డీపీఓ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సాయం


సాయం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

ఆత్రేయపురం: స్థానిక మహాత్మాగాంధీ కళాశాల పూర్వ విద్యార్థి, ఆత్రేయపురం గ్రామానికి చెందిన యాతం సంతోష్ కళాశాల అభివృద్ధికి రూ.40 వేలు అందించారు. ఉద్యోగ రీత్యా అమెరికాలో ఉంటూ తెలుగు అసోసియేషన్ సభ్యుడిగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తాను చదువుకున్న కళాశాలకు ఆర్థిక సహాయాన్ని తన కుటుంబ సభ్యుల ద్వారా కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ పీఎస్ రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా పీఎస్ రాజు మాట్లాడుతూ సంతోష్‌ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత విద్యను అభ్యసించి సమాజ సేవకు తోడ్పాలన్నారు. సంతోష్ కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరావు, సూర్యనాగమణి, డాక్టర్ బాలాజీ సురేష్, రేవతిని ఆయనతో పాటు ప్రిన్సిపాల్ బీవీఆర్ అభినందించారు.

22న సెలవుకు ఆదేశాలు

యానాం: అయోధ్యలో సీతారాముల ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈనెల 22 సోమవారం పుదుచ్చేరితో పాటు యానాం, మాహే, కారైకల్ రీజియన్‌ల్లో సెలవు ప్రకటిస్తూ పుదుచ్చేరి ప్రభుత్వ కార్యదర్శి ఎంపీ హిరాన్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఎల్జీ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు అధికార గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే ఫిబ్రవరి 17న శనివారం కాంపన్‌సేటరీ వర్కింగ్ డేగా ఉంటుందన్నారు.

మొదలైన ఎన్నికల బదిలీలు

అమలాపురం పట్టణ సీఐగా క్రిస్టోఫర్


కొత్త సీఐ క్రిస్టోఫర్‌ను అభినందిస్తున్న సీఐ క్రాంతికుమార్

అమలాపురం టౌన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో సాధారణ బదిలీలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా అమలాపురం పట్టణ సీఐగా పనిచేస్తున్న టి.క్రాంతికుమార్ ఏలూరు జిల్లా జీలుగుమిల్లి సీఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ ట్రాఫిక్ విభాగంలో సీఐగా పనిచేస్తున్న క్రిస్టోఫర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ సునరావు శ్రీధర్, అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్‌లను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ క్రిస్టోఫర్ గతంలో అమలాపురం రూరల్, ఐ.పోలవరం ఎస్ఐగా, రాజోలు సీఐగా పని చేశారు. అందరి సహకారంతో వచ్చే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని కొత్త సీఐ క్రిస్టోఫర్ అన్నారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన సీఐ క్రాంతికుమార్ శనివారమే రిలీవ్ అయ్యి బాధ్యతల స్వీకరణకు జీలుగుమిల్లి వెళ్లారు. సీఐ క్రాంతికుమార్ ఆరు నెలల క్రితమే అమలాపురం పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఒకే జిల్లాలో లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారిగా పలు పోలీస్‌స్టేషన్లలో పని చేస్తూ మూడేళ్లు దాటితే విధిగా బదిలీతో బయట జిల్లాకు వెళ్లాల్సిందే. దీంతో ఆయన బదిలీ అనివార్యమైంది.

నిధుల దుర్వినియోగంపై విచారణ

కాట్రేనికోన: మండలంలోని కుండలేశ్వరం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అధికారులు విచారణ జరిపి అవకతవకలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. గత మూడేళ్ళలో కుండలేశ్వరం పంచాయతీలో సుమారు రూ.21 లక్షల నిధులు దుర్వినియోగమయ్యాయమంటూ స్థానిక ఎంపీటీసీ అక్కల శ్రీధర్ ఫిర్యాదు చేయడంతో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో కాట్రేనికోన ఈఓపీఆర్డీ కామేశ్వరరావు విచారణ చేపట్టి నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. అవకతవకల్లో కుండలేశ్వరం పంచాయతీ సర్పంచ్‌తో పాటు సెక్రటరీ రవిరాజు, సచివాలయ సిబ్బంది సాగర్‌ల ప్రమేయం ఉన్నట్లు గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశామని ఈఓపీఆర్డీ కామేశ్వరరావు తెలిపారు.

నల్లముట్టె పురుగు నివారణపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త అనూష

ఉప్పలగుప్తం: కొబ్బరిని ఆశించే నల్లముట్టె పురుగు నివారణపై శనివారం సన్నవిల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ చిక్కం పెదబాబు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో అంబాజీపేట శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష, ఉద్యానశాఖ అధికారి చందనలు కొబ్బరి సాగులో నల్లముట్టె పురుగు నివారణకు తీసుకోవలసిన సస్యరక్షణ పద్ధతులను రైతులకు వివరించారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ వంగా గిరిజాకుమారి, ఎంపీడీఓ కేవీ ప్రసాద్, సచివాలయ కన్వీనర్ నాగబాబు, రైతులు చిక్కం నాయుడు, గనిశెట్టి సత్యనారాయణ, పోలినాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతను కాపాడుకుందాం

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్


మొక్కలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్

యానాం: పర్యావరణ సమతుల్యత కాపాడుకోవడానికి మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీలో మిషన్ గ్రీన్ పుదుచ్చేరి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని, విచ్చలవిడిగా చెట్లు నరికేయడంతో భూతాపం పెరిగిపోతుందన్నారు. ఇంటింటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని రెండేళ్ల క్రితమే పుదుచ్చేరి ప్రభుత్వం నిర్వహించిందన్నారు. 12 ఏళ్ల అనంతరం రీజెన్సీ ఫ్యాక్టరీ పునః ప్రారంభం కానున్న సందర్భంగా మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఎండీ ఎన్.సత్యేంద్రప్రసాద్, సంస్థ ప్రతినిధి రాజేంద్రప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు సాంకేతిక విద్య


విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రసన్న కుమారి

మలికిపురం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు సాంకేతిక విద్య అందుబాటు లోనికి తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని మలికిపురం జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్న కుమారి పేర్కొన్నారు. రామరాజులంక గ్రామం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మంజూరైన ట్యాబ్‌లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లిన ఘనత కూడా జగన్‌దేనని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి, హెచ్ సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ మేడిచర్ల వెంకట్రాజు పాల్గొన్నారు.

108లో ప్రసవం


అంబులెన్సులో ప్రసవించిన ప్రశాంతి

మామిడికుదురు: మగటపల్లికి చెందిన గర్భిణి మిరప ప్రశాంతికి శుక్రవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో 108 కాల్ చేశారు. మామిడికుదురు 108 వాహన సిబ్బంది హుటాహుటిన మగటపల్లి చేరుకుని ఆమెను ఆస్పత్రికి తరలించే క్రమంలో నొప్పులు తీవ్రం కావడంతో మార్గమధ్యంలోనే ప్రసవం చేశారు. ప్రశాంతి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు 108 సిబ్బంది జీపీ దాసు, ఎం.మోహన్ తెలిపారు.

క్లుప్తంగా

మాజీమంత్రి ఆళ్వార్‌దాస్‌కు ఘన నివాళి


ఆళ్వార్‌దాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వాకర్స్ ఫౌండర్, మాజీ మంత్రి సుంకర ఆళ్వార్‌దాస్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక గడియారం స్తంభం సెంటరులో వాకర్స్ ప్రతినిధులు ఆళ్వార్‌దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో అంతర్జాతీయ, జిల్లా, పట్టణ వాకర్స్ ప్రతినిధులు తేతలి సత్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, పుత్సా కృష్ణ కామేశ్వర్, పెనుమాల చిట్టిబాబు, రంకిరెడ్డి కాశీ, బోణం సత్తిబాబు, డాక్టర్ బి.రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు విజయీభవ


ఇంటర్మీడియట్ ప్రీ ఫైనల్ పరీక్షలను తనిఖీ చేస్తున్న డీఐఈవో సత్యనారాయణరెడ్డి

అమలాపురం టౌన్: ఇంటర్మీడియట్ విద్యార్థులు రానున్న మార్చి మొదటి వారంలో జరిగే ఫైనల్ పరీక్షల్లో విజయం సాధించాలని 50 రోజుల ప్రణాళికతో ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్(ఐపీఈ) 2024 పేరుతో విజయీభవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విజయీభవ కార్యక్రమం ఎలా అమలవుతుందో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీఐఈవో) ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. కళాశాలలో విద్యార్థులు రాస్తున్న ప్రీఫైనల్ పరీక్షలను ఆయన తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యా ప్రగతి, ఫైనల్ పరీక్షల సన్నద్ధతపై ప్రణాళికలను కళాశాల అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కవల కోటిలింగం కళాశాలలో ఇంటర్ పరీక్షల సన్నద్ధతను వివరించగా డీఐఈవో సత్యనారాయణరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు.

అయోధ్య అక్షతల పంపిణీ


బండారులంకలో అక్షతలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి దోలామణి

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక నారాయణరావుపేటలో అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షతలను స్థానిక మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీటీసీ గుత్తుల జానకిలక్ష్మి, సొసైటీ మాజీ అధ్యక్షుడు దంగేటి బుల్లబ్బులు, జక్కంశెట్టి సతీష్, కుడిపూడి చంద్ర శ్రీనివాసరావు, దంగేటి నారాయణరావు తదితరులు ఇంటింటికీ పంచిపెట్టారు.

వైఎస్సార్ తక్షణ బీమా సాయం అందజేత


బాధిత కుటుంబానికి రూ.10 వేల నగదు అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు

తాళ్లరేవు: పోలేకుర్రు గ్రామ పంచాయతీ సుంకటరేవుకు చెందిన వడ్డమూరి వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని శనివారం స్థానిక సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, స్థానిక నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.10 వేల నగదును వెంకటేశ్వరరావు భార్య సాయిలక్ష్మికి అందజేశారు. మిగిలిన బీమా సొమ్ము బ్యాంక్‌లో జమవుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ, ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి, స్థానిక వార్డు సభ్యులు పలివెల శ్రీనివాసరావు, పలివెల నాగేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ వినయ్, డిజిటల్ అసిస్టెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పంగలలో...

తాళ్లరేవు: ఉప్పంగల గ్రామ పంచాయతీకి చెందిన కాదా పెదనాగబాబు శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని స్థానిక సర్పంచ్ శాఖా శంకరుడు పరామర్శించి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు దొమ్మేటి లోవరాజు, సచివాలయ కన్వీనర్ సీహెచ్ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన సదస్సు


రెడ్డిపల్లిలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ ప్రసన్న ప్రవీణ్ తదితరులు

అమలాపురం రూరల్: మండలంలోని రెడ్డిపల్లి సచివాలయం వద్ద ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవీఎం మెషీన్ ద్వారా ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కరాటం ప్రసన్నప్రవీణ్ మాట్లాడుతూ ప్రతీఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలసరస్వతి, సచివాలయ ఉద్యోగులు జి.స్వర్ణ, ఆర్.మహేష్, నల్లా సతీష్, వీఆర్ఓ గంధం దొరబాబు, ఎరుబండి బాబులు, లావణ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సొమ్ము జమ

కాట్రేనికోన: మండలంలోని చెయ్యేరుకు చెందిన బడితి ఆనందరావు గత నెల 10న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం ద్వారా దహన సంస్కారాల నిమిత్తం వైఎస్సార్ తక్షణ బీమా సాయంగా రూ.10 వేలు అందజేశారు. తాజాగా ఈ నెల 19వ తేదీన ఆనందరావు భార్య నాగమణి ఖాతాకు వైఎస్సార్ బీమా సొమ్ము రూ.5 లక్షలు జమ అయ్యింది. ఇంటి యజమాని చనిపోతే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం వైఎస్సార్ బీమాగా రూ.5 లక్షల సొమ్ము ఇచ్చి ఆదుకుందంటూ ఆనందరావు కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

మండల స్థాయి వాలీబాల్ విజేత ఎ.వేమవరప్పాడు


ఎ.వేమవరప్పాడు జట్టుకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: స్థానిక బాలయోగి స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా శనివారం మండల స్థాయి వాలీబాల్ ఫైనల్ పోటీల్లో ఎ.వేమవరప్పాడు, వేమవరం జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ఎ.వేమవరప్పాడు జట్టు ఫైనల్‌లో గెలుపొంది మండల స్థాయి విజేతగా నిలిచింది. అనంతరం విజేతలకు ఎంపీడీఓ జె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రెడ్డి శిరీషలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పెయ్యల సాయి, కుమ్మరి అభి, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విస్తృతంగా కులగణన సర్వే


కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: మండలంలోని 23 సచివాలయాల పరిధిలో కుల గణన సర్వే విస్తృతంగా సాగుతుందని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. అల్లవరంలో నిర్వహిస్తున్న కుల గణన సర్వేని శనివారం ఆయన పరిశీలించారు. వలంటీర్లు యాప్‌లో ఇచ్చిన అన్ని వివరాలను నమోదు చేయాలని, అనంతరం లబ్ధిదారుని బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు. సర్వేని త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

యానాం మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

యానాం: విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా యానాం మున్సిపల్ కమిషనర్ ఆర్.అరుల్ ప్రకాశంను సస్పెండ్ చేస్తూ పుదుచ్చేరి కలెక్టర్, ఎల్ఏడీ కార్యదర్శి ఇ.వల్లవన్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. పీసీఎస్ అధికారి హోదాలో మున్సిపల్ కమిషనర్‌గా కొన్ని నెలల క్రితం విధుల్లో చేరిన అరుల్‌ప్రకాశం యానాంలో పేకాట క్లబ్‌లైన విక్టరీ, గుడ్‌లక్ క్లబ్‌లకు సరైన పత్రాలు లేకుండా నిర్వహణకు అనుమతివ్వడం తదితర ఆరోపణల నేపథ్యంలో ఆయనపై పలు ఫిర్యాదులు వెళ్లాయి. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ నిబంధనల మేరకు ఉన్నతాధికారులు వేటు వేసినట్లు తెలిసింది. ఆయనను తక్షణం విధుల నుంచి తప్పించడంతో పాటు తన అనుమతి లేకుండా యానాం వదిలి వెళ్లరాదంటూ కలెక్టర్ వల్లవన్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

అమలాపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మూడు కేంద్రాల్లోనూ కలిపి మొత్తంగా 614 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 794 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 180 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 196 మంది, మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 214 మంది, జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 204 మంది పరీక్ష రాశారు.

నవోదయ పరీక్షకు 324 మంది హాజరు

యానాం: స్థానిక నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశానికి శనివారం నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్‌కు 324 మంది హాజరైనట్లు విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యానాం ఎంజీజీబీహెచ్ స్కూల్‌లో 192 మందికి గాను 166 మంది, రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 193 మందికి గాను 158 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. పరీక్షలను నవోదయ ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు పర్యవేక్షించారన్నారు.